# సెక్షన్ జీ

తాడిమళ్ల రామకృష్ణ

రాజారావ్ సెక్రటేరియట్ కారిడార్‌లో నడుస్తున్నాడు.

అతని మనసు వేగంగా పరుగెత్తుతోంది. గుండెచేసే చప్పుడు బయటకూడా వినిపిస్తోందేమో అన్న అనుమానం కూడా వచ్చింది.

ఒంటికి చెమటలు పట్టడం బాగా ఫీలవుతున్నాడు.

ఫీలింగ్స్‌ని తుడుచుకుందామని రుమాలుకోసం జేబులో చెయ్యిపెట్టాడు.

అది లేదు!

స్కూటరు సీటుమీద ఉండొచ్చు అనుకున్నాడు.

అతనికి అప్పుడు కావల్సింది రుమాలు.

అది లేదు.

అయినా అది చేసే పని అతని స్కైకలర్ ఫుల్‌షర్ట్ 'కఫ్' చేసేసింది.

అయినా అతనిలోని భయం చెరిగిపోలేదు.

'జీ' సెక్షన్ దాటిపోలేదు.

ఆ సెక్షన్‌లో ఎదురుగా....

రాజారావ్ ఆలోచించలేకపోయాడు.

వెనక్కి వెళ్ళిపోదామనీ, వీలయితే పారిపోదామని అన్పించింది.

కానీ ఆ రెండు పన్లు చేయలేకపోయాడు.

అతనికి ముందుకు కదలక తప్పలేదు నడుస్తున్నాడు....

కొన్ని అడుగులు చాలు—'జీ' సెక్షన్ దాటిపోతుంది.

సెక్షన్ దాటిపోతే చాలదు. లత చూపులకి అందకూడదు.

లత....

రాజారావ్ ఒళ్ళు జలదరించింది.

గుండె ఆగిపోతే బావుండునన్పించింది.

భయం....

ఒహాటే భయం....

లత తన్ని చూస్తే, అతనికి సీత జ్ఞాపకమొచ్చింది. నాల్నెల్ల క్రితం తనకి జరిగిన పెళ్ళి గుర్తొచ్చింది.

వాళ్ళిద్దరి ప్రేమయాత్రలు గుర్తొచ్చాయ్. పుట్టబోయే తెల్లటి పాప గుర్తొచ్చింది.

కానీ....

తన స్వర్గం కొన్ని క్షణాల్లో నరకం కాబోతోంది.

లత తన్ని చూస్తుంది.

ఆ చూపుల్ని తప్పించుకోలేదు.

సరిగ్గా సంవత్సరం క్రితం అదే కారిడార్‌లో లత పరిచయమయింది. కాదు తను పరిచయం చేయబడ్డాడు.

'ష్యూర్! సాయంత్రానికి మీ పేపరు పంపిస్తాను ఫోన్ చెయ్యండి కన్‌ఫర్మ్

చేస్తాను.' అంది.

రాజారావ్ ఉబ్బితబ్బిబ్బయ్యాడు.

ఎంత బాగా మాట్లాడింది.

ఇంత అందమయిన అందాన్ని చూడటానికి గామోల్సు 'పని' తన్నింతవరకూ లాక్కొచ్చింది. 'థాంక్స్ టు పని, అనుకొన్నాడు. మరో థాంక్స్ లతకి చెప్పి బయటపడ్డాడు.

ఆ అదుర్సూసుకొని ఆమె తలపులు అతన్ని వెంటాడాయ్.

లత....

పేరుకు తగ్గ స్మార్ట్‌నెస్.

ఆపైన ఆ కళ్ళు .... వాటిల్లోని చూపులు. రాజారావ్‌కి ఆ ఆలోచనలు వెచ్చగా ఉన్నాయ్.

మరోసారి ఆమెని చూడాలన్పించింది.

ఆ సమయానికే అతను 'అవుట్' గేట్ దాటేశాడు.

మళ్ళీ తేలిగ్గా లోపలికి జొరబడలేడు.

అందుకని టైం చూసుకొన్నాడు.

ఆఫీసు అవటానికి మరో నాలుగ్గంటలు గడవాలి.

అదేమంత టాస్క్ అన్పించలేదు.

లత తలపులు ఆ పని చూస్తున్నాయ్.

రాజారావ్ మళ్ళీ టైం చూసుకొన్నాడు.

సెక్రటేరియట్ దగ్గర ఐదు గంట లయింది.

గేటులోంచి దూరంగా లత కన్పించింది.

ఆడవాళ్ళని ఆకర్షించాలని మగవాళ్ళు వేసే వేషాలన్నీ ముందుగానే వేయటం మూలంగా గామోల్సు రాజారావ్ ట్రిమ్‌గా ఉన్నాడు.

టినోపాల్‌లో ఉతికిన బట్టలా ఉన్నాడు.

లత దగ్గరయింది.



రాజారావ్ దగ్గరయ్యాడు

ఇద్దరు పెదాలు కదిలాయ్

ఆ క్షణం ఇద్దరిలోనూ చిన్న సైజు 'లవ్వు' మొదలైంది.

రెండు మనసులకి పొద్దుపోవటానికి అది చాలు.

రోజురోజుకి లత రాజారావ్‌లో పెరిగి పోయింది. అతని మనసులో లత లావై కూర్చుంది. రాజారావేం తక్కువ తిన్లేదు. లతలోనూ ఎదిగాడు. అందుకు నిదర్శనంగా సినిమాలు....షేటింగులు....

ఆఫీసులో లత వేళ్ళు ఎప్పుడూ రాజారావు పేరే టైపు చేస్తున్నాయ్.

ఆఫీసు పనంటేనే విసుక్కుంటోంది.

ఆఫీసరంటేనే మండిపడుతోంది.

డిక్టేషన్‌లో రాజారావ్ పేరు లాంగ్ హాండ్‌లో మరీ రాసేస్తోంది.

మూడేసి గంటలకోసారి రాజారావ్‌ని ఫోన్‌లో పలకరిస్తోంది.

ఈ లక్షణాలన్నీ కనిపెడ్తున్న సూపర్నెంటుని ఓ సారి 'నీకేం, నా యిష్టం' అని ఓ ఎరన్డ్ లీవ్ పారేసి రాజారావ్‌తో ఉడాయించింది.

లీవయ్యాక రాకపోతే లేచిపోయిందనుకొనే వారే కాని దశమి సోమవారం సరిగ్గా పది గంటలకి టైప్ మిషన్ టక టక లాడటంతో అంత ధైర్యం చేయ లేదేమో అని అందరూ ముక్కుమీద వేలేసుకొన్నారు. వాళ్ళు తేరుకొనేసరికి రాజారావ్‌తో ఓసారి ఫోన్లో మాట్లాడ్డంతో మరీ తెగించిందనిమటుకూ అనుకొన్నారు.

రాజారావ్ పెళ్ళి శుభలేఖతో వాళ్ళిద్దరి ప్రేమాయణం కుంటుపడింది.

అంతే

పెళ్ళి అయిన రాజారావ్‌ని లత మళ్ళీ చూడలేదు పెళ్ళయాక రాజారావ్ లతని తలుచుకోలేదు.

నాల్నెల్ల తర్వాత....

అదే కారిడార్....

అదే సెక్షన్....సెక్షన్ 'జి'.

కొన్ని నెలలు తను గాఢంగా ప్రేమించిన లతని పోగొట్టుకొన్నాడు.

కారణాలు అనవసరం.

పోగొట్టుకున్నాడు.

తనే జీవితం,తనే శాశ్వతం అనుకొన్న లత తనని క్షమిస్తుందా? క్షమించదు!

పైగా చిత్రవధ చేస్తుంది. నరికి పోగు పెడ్తుంది. టైప్ మిషన్‌లో రోల్ చేసి టైపు చేసేస్తుంది.

తన ముద్దుల జీవితానికి క్రిందటిరోజే ఆఖరోజు.

రాజారావ్ బాధ పడ్డాడు. తను వచ్చినందుక్కాదు. లతని ప్రేమించినందుకు. లత తన్ని ప్రేమించినందుకు.

తన్ని చూడగానే భోరున ఏడుస్తుంది. ఇలా అన్యాయం ఎందుకు చేశావంటుంది. జుట్టు పీక్కుంటుంది. తన గుండెలమీద రెండు చేతుల్తో దబ దబా గాజులు చప్పుడయ్యేలా బాత్తుంది.

తనేం చెప్పగలడు?

తన దగ్గరేం జవాబుంది!

రాజారావ్‌కి ఏడుపొచ్చినంత పనైంది.

ఇకముందు తన జీవితంలో సీతని తప్ప ఎవర్నీ ప్రేమించకూడదనుకొన్నాడు.

ఇంకా ప్రేమా! అని కూడా నొచ్చుకున్నాడు.

మరో మూడు అడుగులు వేస్తే చాలు




రాజారావ్‌లో కిలోలు చొప్పున నిస్సత్తువ ప్రవేశిస్తోంది.

అంతే....

రాజారావ్ ఆలోచనలు మొద్దుబారి పోయాయ్.

షాక్ తిన్నవాడిలా నిలబడిపోయాడు.

భయంగా నిలబడిపోయాడు—ఎదురుగా లత. అతనికి దగ్గరగా—మరీ దగ్గరగా లత.

రాజారావ్‌ని చూసిన లత నవ్వింది.

జాలిగా నవ్వలేదు.

విషాదంగానూ నవ్వలేదు.

నిండుగా నవ్వింది.

గమ్మత్తుగా నవ్వింది.

కారిడార్ నిండా నవ్వులు ఒలకబోసుకొంటూ విజిటర్స్ రూమ్‌లోకి నడిచింది

లత నవ్వు రాజారావ్‌కి వరం అయింది

నవ్వుతున్న లత దేవతలా తోచింది

అతని ఆలోచనలు మాటల్ని పోసుగుకున్నాయ్!

"క్షమించు లతా! అనుకోని పరిస్థితుల్లో నిన్ను దూరం చేసుకోవాల్సి వచ్చింది."

గమ్మత్తుగా నవ్విన లత నవ్వాపాక అంది:

"నీలాంటి మగ పురుగులుకి మనసుండదని తెల్సే నేను మనసిచ్చినట్టు నటించాను. నాక్కావల్సింది థ్రిల్. అది నువ్విచ్చావ్. నీలాగే ఇంతకుముందు ముగ్గురిచ్చారు. ప్రేమిస్తే పెళ్ళి చేసుకోవాలన్న తపన ఉన్న మగాడు కన్పించే వరకూ నేనూ ప్రేమిస్తూనే ఉంటాను. టేకిట్ సీరియస్. ఇంట్లో నీ శ్రీమతి ఎదురు చూస్తుంటుంది. వెళ్ళి ప్రేమిస్తూ కూర్చో!

అయోమయంగా చూస్తున్న రాజారావ్ తేరుకునేసరికి విజిటర్స్ రూం ఖాళీగా ఉంది ★